ప్రేమ పేరుతో మోసం..

## పెళ్లికి నిరాకరణ




- ఎమ్మెల్యే గండ్ర పీఏ శ్రీనివాస్ అరెస్ట్
- జడ్జి ఎదుట హాజరు.. రిమాండ్‌కు తరలింపు
- నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

05

## 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా తరహాలో ఘోరం

- పెళ్లికి నిరాకరించిందని యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్
- హైదరాబాద్ శివారులో వెలుగు చూసిన ఘటన

05




## దేవుడా.. ఎంత పరీక్ష!



- అమ్మానాన్నలు శవాలయ్యారని తెలియక.. పరీక్ష రాసిన బిడ్డ
- నిజం దాచిన ఊరు.. గుండె నిబ్బరంతో పరీక్ష రాసిన వసంత!

05


సంపుటి :03 | సంచిక :37 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 14, మార్చి 2026


## వివాదం

04

- వైస్ చైర్ పర్సన్ కు అవమానం జరిగిందంటున్న ఎమ్మార్పీఎస్
- ప్రోటోకాల్ ఉల్లంఘించటమేనని ఆరోపణ
- ఖండించిన మున్సిపాల్టీ కమిషనర్ అంజయ్య

## `కూలీ'న జీవితాలు

- పూడిక తీస్తున్న క్రమంలో బావిలో పడిన క్రేన్
- ప్రమాదంలో ముగ్గురు మృతి.. వీరిలో ఒకరు విద్యార్థి
- మరో బాలుడికి తీవ్ర గాయాలు
- భూపాలపల్లి జిల్లా కొరికిశాలలో ఘటన
- గ్రామంలో విషాద ఛాయలు

03





## మామునూరు వద్ద రోడ్డు ప్రమాదం

05

బొలెరో ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం





### ఆన్‌లైన్ బుకింగ్స్ వల్లే



రాష్ట్రంలో ప్రజలు భయపడి ముందుగానే ఎక్కువ గ్యాస్ సిలిండర్లు బుకింగ్స్ చేస్తున్నారు. దీంతో సాధారణం కంటే రెట్టింపు సిలిండర్లు బుకింగ్ అవుతున్నాయి. గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ కొరత లేదు. వాణిజ్య సిలిండర్ల కొరత ఉంది. అయినప్పటికీ ఎప్పటికప్పుడు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయి.

**-– రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

### ఎలాంటి కొరత లేదు..

దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలకు ఎలాంటి కొరత లేదు. చమురు ధరల నియంత్రణ, సరఫరా తలెత్తే ఆటంకాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎలాంటి పరిస్థితులైనా ఎందుర్కొంటాం. గ్యాస్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్, విమాన ఇంధన నిల్వలు తగినంతగా అందుబాటులో ఉన్నాయి.

**- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



# పతాక స్థాయికి సిలిండర్


- నల్లబజారులో వాణిజ్య సిలిండర్ల విక్రయం
- ఒక్కో సిలిండర్ ధర రూ.5 వేల కు పైగానే..
- ఇప్పటికే మూతపడిన వేలాది హోటళ్లు, రెస్టారెంట్లు
- వీధిన పడిన ఆధారిత కార్మికులు, వారి కుటుంబాలు
- డొమెస్టిక్ సిలిండర్ కోసమూ ఏజెన్సీల వద్ద బారులు
- గంటల కొద్దీ వేచి సిలిండర్ తీసుకెళ్తున్న వినియోగదారులు

02


## తెలంగాణ వ్యాప్తంగా సిలిండర్ సంక్షోభం

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. యుద్ధ ప్రభావం భారత్‌వంటి దేశాలపైనా పడుతున్నది. దేశ వ్యాప్తంగా ఎల్పీజీ, గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. అదే విధంగా తెలంగాణలో సామాన్యుడి వంటగదిని గ్యాస్ సంక్షోభం అతలాకుతలం చేస్తున్నది. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని, ఎల్పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గంభీర ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు రోడ్లపై ఆటోల వెనుక పరుగులు తీయడం, అర్ధరాత్రి నుంచే గ్యాస్ ఏజెన్సీల ముందు మండుటెండలో గంటల తరబడి బారులు తీరడం ప్రస్తుత సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



# పతాక స్థాయికి
# సిలిం'డర్'




## ఆన్ లైన్ బుకింగ్స్ వల్లే
**: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



రాష్ట్రంలో ప్రజలు భయపడి ముందుగానే ఎక్కువ గ్యాస్ సిలిండర్లు బుకింగ్స్ చేస్తున్నారని దాంతో సాధారణం కంటే రెట్టింపు సిలిండర్లు బుకింగ్ అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ కొరత లేదని వాణిజ్య సిలిండర్ల కొరత ఉందన్నారు. ఇవాళ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం అయిన మంత్రి ఉత్తమ్.. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని ప్రస్తుత పరిస్థితులపై డిస్ట్రిబ్యూటర్లతో చర్చించామన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో 1.3 కోట్ల మంది ఎల్బీజీ వినియోగదారులు ఉన్నారని చెప్పారు. దీపం పథకం కింద 28 లక్షల మంది ఎల్పీజీని వినియోగిస్తున్నారని ప్రతి నెల గృహ వినియోగదారులు 60 లక్షల సిలిండర్లు వాడుతున్నారని చెప్పారు. కాగా తాజాగా పరిస్థితులపై నిన్న సెక్రటేరియట్ లో ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. అపోహలు వద్దన బాట్లింగ్ ప్లాంట్లలో కొరత లేదని చెప్పారు. హోటళ్లకు కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని అయితే బ్లాక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎలాంటి కొరత లేదు..
**- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలకు ఎలాంటి కొరత లేదు. చమురు ధరల నియంత్రణ, సరఫరా తలెత్తే ఆటంకాలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఎలాంటి పరిస్థితులైనా ఎందుర్కొంటాం. గ్యాస్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్, విమాన ఇంధన నిల్వలు తగినంతగా అందుబాటులో ఉన్నాయి.

## ఎల్పీజీ ఉత్పత్తి పెంచాం
**- కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి**



దేశంలో గ్యాస్, ఎల్పీజీ కొరత లేదు. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని 28 శాతం పెంచాం. ఎల్పీజీ కోసం పశ్చిమాసియాపై ఆధారపడటాన్ని తగ్గించాం. ఇతర దేశాల నుంచి ఎల్పీజీ నిల్వలు తెప్పిస్తున్నాం. వాహనాలకు సీఎన్జీ సరఫరాలో ఎటువంటి కోతలు ఉండవు.

- **తెలంగాణ వ్యాప్తంగా సిలిండ ర్ సంక్షోభం**
- **నల్లబజారులో వాణిజ్య సిలిండర్ల విక్రయం**
- **ఒక్కో సిలిండర్ ధర రూ.5 వేల కు పైగానే..**
- **ఇప్పటికే మూతపడిన వేలాది హోటళ్లు, రెస్టారెంట్లు**
- **వీధిన పడిన ఆధారిత కార్మికులు, వారి కుటుంబాలు**
- **డొమెస్టిక్ సిలిండర్ కోసమూ ఏజెన్సీల వద్ద బారులు**
- **గంటల కొద్దీ వేచి సిలిండర్ తీసుకెళ్తున్న వినియోగదారులు**

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. యుద్ధ ప్రభావం భారత్‌వంటి దేశాలపైనా పడుతున్నది. దేశ వ్యాప్తంగా ఎల్పీజీ, గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. అదే విధంగా తెలంగాణలో సామాన్యుడి వంటగదిని గ్యాస్ సంక్షోభం అతలాకుతలం చేస్తున్నది. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని, ఎల్పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గంభీర ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. గ్యాస్ సిలిండర్ల కోసం వినియోగదారులు రోడ్లపై ఆటోల వెనుక పరుగులు తీయడం, అర్ధరాత్రి నుంచే గ్యాస్ ఏజెన్సీల ముందు మండుటెండలో గంటల తరబడి బారులు తీరడం ప్రస్తుత సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది. ఆన్‌లైన్ బుకింగ్‌లు సకాలంలో కాకపోవడం, బుక్ చేసిన వారికి వారాల తరబడి సిలిండర్లు అందకపోవడంతో ప్రజల్లో ఆందోళన పెరిగిపోతోంది. యుద్ధం కారణంగా మున్ముందు సరఫరా పూర్తిగా నిలిచిపోతుందన్న భయంతో వినియోగదారులు ముందస్తుగా సిలిండర్లను నిల్వ చేసుకునే ప్రయత్నం చేస్తుండటం, కృత్రిమ కొరతకు దారితీస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిల్వలు ఉన్నా, సామాన్యుడి చేతికి సిలిండర్ అందకపోవడం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతున్నది.

### - హోటల్ రంగం కుదేలు

రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు మరియు చిన్నపాటి టిఫిన్ సెంటర్లు ఈ సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉండటంతో అనేక హోటళ్లు తమ బోర్డులను తిప్పేస్తున్నాయి. సాధారణంగా రూ. 2,000 లోపు ఉండే కమర్షియల్ సిలిండర్ ధర ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రూ. 5,500 దాటిందని వ్యాపారులు వాపోతున్నారు. ఇంత భారీ ధర పెట్టి వ్యాపారాలు చేయడం సాధ్యం కాదని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. దీనివల్ల ఆయా రంగాలపై ఆధారపడి జీవించే వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. సామాన్యుడికి గృహ వినియోగ గ్యాస్ అందక, బయట తినేందుకు హోటళ్లు లేక జనం అవస్థలు పడుతుంటే, అక్రమార్కులు మాత్రం ఇదే తరుణంలో సిలిండర్లను బ్లాక్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### - సంక్షోభానికి కారణాలు

పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల భవిష్యత్తులో గ్యాస్ సరఫరా నిలిచిపోతుందనే అపోహతో వినియోగదారులు ముందస్తుగా భారీ సంఖ్యలో బుకింగ్‌లు చేయడం వల్ల డిమాండ్ అమాంతం పెరిగింది. వాణిజ్య సిలిండర్ల కొరతను సాకుగా చూపుతూ కొన్ని ఏజెన్సీలు రూ. 2 వేల సిలిండర్‌ను రూ. 5,500 కు పైగా ధరకు అక్రమంగా విక్రయించడం వల్ల హోటల్ రంగం మూతపడే పరిస్థితికి చేరింది. బాట్లింగ్ ప్లాంట్లలో నిల్వలు ఉన్నప్పటికీ, జిల్లా స్థాయి పంపిణీ వ్యవస్థ మరియు రవాణాలో తలెత్తిన ఆటంకాల వల్ల క్షేత్రస్థాయిలో సిలిండర్ల కొరత ఏర్పడింది. ప్రభుత్వం గృహ సిలిండర్లకు ఇబ్బంది లేదని చెబుతున్నా, వ్యాపార అవసరాలకు గ్యాస్ దొరకకపోవడంతో కొందరు అక్రమంగా గృహ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు పెంచి, బ్లాక్ మార్కెట్‌ను అదుపు చేస్తే తప్ప ఈ గ్యాస్ సెగలు చల్లారేలా కనిపించడం లేదు.

### - దెబ్బతింటున్న ఉపాధి

గ్యాస్ సంక్షోభం కేవలం వంటగదికే పరిమితం కాకుండా, వేల కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీస్తోంది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్నపాటి టిఫిన్ సెంటర్లు, మెస్‌లు వంట గ్యాస్ అందక మూతపడటంతో వాటిపై ఆధారపడి జీవించే కార్మికులు రోడ్డున పడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ల ధరలు ఆకాశాన్నంటడం, బ్లాక్ మార్కెట్‌లో విపరీతమైన ధరలు వెచ్చించలేక యాజమాన్యాలు వ్యాపారాలను నిలిపివేస్తున్నాయి. దీనివల్ల వంట చేసే మాస్టర్లు, సర్వర్లు, క్లీనర్లు, డెలివరీ బాయ్స్ వంటి అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే, మరోవైపు చేతిలో పని లేకపోవడంతో కార్మిక వర్గం ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొంది. ఈ గ్యాస్ గండం ఇలాగే కొనసాగితే పర్యాటక, ఆతిథ్య రంగాలు కుప్పకూలి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. సామాన్యుడి ఉపాధిపై కోలుకోలేని దెబ్బ పడే ప్రమాదం ఉంది.

### - గ్యాస్ సరఫరా చేయండి: తెలంగాణ హోటళ్ల సంఘం

రాష్ట్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, మెస్‌లు, దాబాలు, క్యాంటీన్లు తదితర వాటిని అత్యవసర సేవా సంస్థలుగా పరిగణించి.. వంట గ్యాస్ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేయాలని తెలంగాణ హోటళ్ల సంఘం తాజాగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరింది. రాష్ట్ర పర్యాటక, ఆతిథ్య, సేవా రంగాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, వలస కూలీలకు ఆహార అవసరాలను తీర్చడమే గాక.. వేల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. యుద్ధం వల్ల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లను మూసేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై వెంటనే జోక్యం చేసుకొని గ్యాస్ సరఫరాను యథాతథంగా కొనసాగించాలని మంత్రికి విన్నవించారు.

# ‘కూలీ’న జీవితాలు

- పూడిక తీస్తున్న క్రమంలో బావిలో పడిన క్రేన్
- ప్రమాదంలో ముగ్గురు మృతి
- మరో బాలుడికి తీవ్ర గాయాలు
- భూపాలపల్లి జిల్లా కొరికిశాలలో ఘటన
- గ్రామంలో విషాద ఛాయలు



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామ శివారులో శుక్రవారం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. వ్యవసాయ బావిలో పూడిక తీసే పనులు జరుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు క్రేన్ బావిలో పడిపోవడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో క్రేన్‌తో పూడిక తొలగిస్తుండగా, ఒక్కసారిగా క్రేన్ పట్టుతప్పి నలుగురితో సహా బావిలో పడిపోయారు. ప్రమాదంలో పిడిసిల్ల గ్రామస్తుడు పైడి (50), కొరికిశాల గ్రామస్తులు దేవరావు (48), అభిలాష్ (16) అనే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి సుకినె మోహన్ రావు తీవ్ర గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని వెలికి తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పైడి, దేవరావు, అభిలాష్ మృతదేహాలను బయటకు తీయించి వారి కుటుంబాలకు అప్పగించారు. ముగ్గురి దుర్మరణంతో కొరికిశాల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## క్రషర్ ఏర్పాటును మానుకోవాలి

**బీఆర్ఎస్ గ్రామ కార్యదర్శి తుడుం వెంకటేష్**




అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో కొత్తగా స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి తుడుం వెంకటేష్ తెలిపారు. గ్రామ పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న క్రషర్, డాంబర్ ప్లాంట్ వల్ల గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, దుమ్ము–ధూళి వల్ల పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. కొత్త క్రషర్ ఏర్పాటును ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అవసరమైతే న్యాయబద్ధ పోరాటం, ఆందోళనలు చేపడతామని వెంకటేష్ స్పష్టం చేశారు.



## పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**: చైర్ పర్సన్ శ్రీలక్ష్మీ రామానంద్**

అక్షర దర్బార్, నర్సంపేట : ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై సమీక్షించారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరచి పట్టణ రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలుకంటి విజయ్, అయూబ్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, నాయకులు బైరి కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ స్టార్ హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

అక్షర దర్బార్, నర్సంపేట : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని గ్రీన్ స్టార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభమయ్యాయి. న్యూరాలజీ, యూరాలజీ విభాగాలకు సంబంధించిన సేవలను డాక్టర్ అమృత్ రెడ్డి, డాక్టర్ శ్రీ చరణ్, డాక్టర్ రఫీ అజ్మల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లెక్కల విద్యసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూరో విభాగంలో పక్షవాతం, రక్తం గడ్డకట్టడం వంటి వ్యాధులకు, యూరాలజీ విభాగంలో కిడ్నీ రాళ్లు, ఇన్ఫెక్షన్లు, మూత్ర సంబంధిత వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఖరీదైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా లభించడం వరప్రదమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు,




డాక్టర్ రాహుల్ పడాల, డాక్టర్ హఫీజ్, ఆరోగ్య మిత్ర కుమార్, కౌన్సిలర్లు రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి, హన్మకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ మాజీ వీసీ లింగమూర్తి కన్నుమూత



అక్షరదర్బార్, హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) మాజీ వైస్ ఛాన్సలర్, విద్యావేత్త ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. లింగమూర్తి 2007 – 2010 వరకు కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఆయన విశిష్ట సేవలందించారు. తన మూడేళ్ల పదవీ కాలంలో విశ్వవిద్యాలయ పురోగతికి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఆయన ఎనలేని కృషి చేశారు. వరంగల్ కేంద్రంగా ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక వర్సిటీకి ఆయన అందించిన సేవలు విద్యార్థులు, అధ్యాపక లోకంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆయన మృతి పట్ల కేయూ ప్రొఫెసర్లు, అధికారులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. విద్యా రంగానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



## బడే నాగజ్యోతి ఆశీర్వదాలు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు నియోజకవర్గం మేడారం కొత్తూరు గ్రామానికి చెందిన జున్నుతుల రాధిక సంపత్ రెడ్డి (లేటు) కుమార్తె అయిన నవ్య రెడ్డీ , బాలకృష్ణ రెడ్డి లైనా నూతన వధూవరులను ఆశీర్వదించిన ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దండుగుల మల్లయ్య, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు చిడం బాబురావు, గొంది శ్రీధర్ యూత్ నాయకులు కోట సురేష్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు





# తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

### మొదలైన పదోతరగతి ఎగ్జామ్స్

అక్షర దర్బార్ శాయంపేట : మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఎంజేపీ (బాలుర) 184 మంది, గర్ల్స్ హై స్కూల్లో 140 మంది మొత్తం 324 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీ క్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై జక్కుల పరమేష్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

### పరీక్షా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అక్షర దర్బార్, నర్సంపేట : టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం నర్సంపేటలోని జెడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షల పర్యవేక్షణలో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలని, కేంద్రంలో సెల్‌ఫోన్లను అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ఇట్టబోయిన రవి యాదవ్ – రమాదేవి దంపతుల కనిష్ట కుమారుడు శ్రీనివాసు యాదవ్ వివాహానికి తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్ అధ్యక్షులు, రైతు విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితోపాటు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ గ్యాస్ కు ఎలాంటి కొరత లేదు

**: తహసీల్దార్ గిరిబాబు**



అక్షర దర్బార్, వెంకటాపూర్ : రాష్ట్రంలో ఎల్పీజీ వంటగ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ సరఫరా, నిల్వలు, పంపిణీ వ్యవస్థ సక్రమంగా కొనసాగుతోందని చెప్పారు. వినియోగదారులకు సకాలంలో వంటగ్యాస్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులను సంప్రదించాలని మండల ప్రజలకు సూచించారు.

## జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎడ్లపల్లి యువకుడు

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన విజయగిరి సాయి కృష్ణ వరుసగా రెండోసారి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సమ్మయ్య–లక్ష్మి దంపతుల కుమారుడైన సాయి కృష్ణ ప్రస్తుతం వరంగల్ ఎల్‌బీ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ గురుకుల హ్యాండ్‌బాల్ అకాడమీ కోచ్ ప్రవీణ్ కుమార్ శిక్షణలో రాణించిన ఆయన, ఈ నెల 17 నుంచి 21 వరకు తమిళనాడులోని విఐటీ వెల్లూర్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ తరపున పాల్గొననున్నారు. సాయి కృష్ణ ఎంపికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రోత్సాహం, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ఆర్థిక సహకారం తన ఎదుగుదలకు తోడ్పడ్డాయని సాయి కృష్ణ తెలిపారు.



### మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో

# ప్రొటోకాల్ వివాదం



- వేదికపైకి పిలవకుండా వైస్ చైర్ పర్సన్ ను అవమానించారని ఎమ్మార్పీఎస్ ఆరోపణ
- ఖండించిన కమిషనర్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఏకు దివ్యకు అవమానం జరిగిందన్న అంశం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ తీవ్రంగా స్పందించగా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య మాత్రం సమావేశం ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించామని తెలిపారు.

### ముమ్మాటికి ప్రొటోకాల్ ఉల్లంఘనే..

**ఎమ్మార్పీఎస్ నేత శంకర్ మాదిగ**



వైస్ చైర్‌పర్సన్‌ను వేదికపైకి ఆహ్వానించకుండా సాధారణ సభ్యుల వరుసలో కూర్చోబెట్టడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని శంకర్ మాదిగ ఆరోపించారు. మున్సిపల్ చట్టం ప్రకారం చైర్మన్, వైస్ చైర్‌పర్సన్, కమిషనర్‌లకు వేదికపై స్థానం కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దళిత మహిళా ప్రజాప్రతినిధిని వేదికపైకి పిలవకపోవడం వివక్షాత్మకమని విమర్శించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రొటోకాల్ ప్రకారమే సమావేశం

**: కమిషనర్ అంజయ్య**



ఇదిలా ఉండగా కమిషనర్ అంజయ్య స్పందిస్తూ సమావేశం పూర్తిగా ప్రోటోకాల్ ప్రకారమే జరిగిందని తెలిపారు. వేదికపై చైర్మన్, కమిషనర్‌తో పాటు ముఖ్య అతిథులైన ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు మాత్రమే స్థానం ఉంటుందని వివరించారు. చైర్మన్ హాజరు కానప్పుడు మాత్రమే వైస్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. పాలకవర్గంలోని ప్రతి సభ్యునికి సమాన గౌరవం ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజా ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమం

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం వెంకటాపురం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పుష్కరాల కోసం ఘాట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే ఏప్రిల్‌లో మంజూరయ్యే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో వెంకటాపురం మండలానికి అధికంగా కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మండల వ్యాప్తంగా 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను సర్పంచులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, సర్పంచ్ సరస్వతి, తహసిల్దార్ వేణుగోపాల్, ఆర్ఐలు మల్లయ్య, విష్ణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నేతల నివాళి

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 17వ డివిజన్‌కు చెందిన పంచగిరి సంపత్ తండ్రి పంచగిరి సాంబశివుడు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, మాజీ కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ చందుపట్ల నరసింహ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్, అడ్వకేట్ దుప్పటి సుజయ్ రణదేవ్, 17వ వార్డు నాయకులు తోట రవీందర్, ఎం.డి. అల్తాఫ్, చెట్టి ఏసు, బండారి కోమల, షాహిన్, జరీనా, సారంగపాణి పాల్గొన్నారు.

## బయోచార్ వినియోగంపై రైతులకు శిక్షణ

- పంట అవశేషాలను కాల్చకుండా బయోచార్ గా మార్చాలి
- పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

అక్షర దర్బార్, పరకాల:రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమర్థ్య పెంపుదల, నైపుణ్యాభివృద్ధి మరియు మద్దతు సేవలపై శిక్షణ కార్యక్రమం శనివారం నాగారం రైతు వేదికలో నిర్వహించారు. ఆత్మ సంస్థ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ బయోచార్ వినియోగం ద్వారా భూమిలో సేంద్రియ కార్బన్ పెరిగి, నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు పంటలకు సులభంగా అందుతాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా బయోచార్‌గా మార్చి భూమిలో వాడితే నేల సారవంతం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో కాకతీయ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈఓ శ్రీనివాసరావు, పసిడి పంట సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఏఈఓ అహ్మద్ రజా సహా సుమారు 25 మంది రైతులు పాల్గొన్నారు.





## భద్రాచలానికి అక్షింతల తరలింపు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరగనున్న సీతారాముల కళ్యాణానికి కాసిందేవిపేట గ్రామం నుంచి గోటి తలంబ్రాలు సమర్పించేందుకు భక్తులు బయలుదేరారు. సర్పంచ్ వాంకుడోత్ నిరోషా అమర్ సింగ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేసి భద్రాచలంకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, కొత్తపెల్లి విజేందర్, గుండాల భాస్కర్, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 'రాజు వెడ్స్ రాంబాయి` సినిమా తరహాలో ఘోరం

- పెళ్లికి నిరాకరించిందని యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్
- హైదరాబాద్ శివారులో వెలుగు చూసిన ఘటన

అక్షరదర్బార్, హైదరాబాద్: ఇటీవల విడుదలైన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాలో కథానుసారంగా కూతురు తనకు ఇష్టంలేని వ్యక్తిని వివాహం చేసుకోబోబోతున్నదని తెలిసి తండ్రి ఆమెకు హైచ్ఐవీ కంటామినేటెడ్ రక్తం ఉన్న ఇంజెక్షన్ ఇస్తాడు. ఇదే తరహాలో తాజాగా హైదరాబాద్ పోచారంలో అలాంటి ఘటనే జరిగింది. పెళ్లికి నిరాకరించిందన్న కారణంతో ఆమెకు ఓ యువకుడు హైచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చాడు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. పోచారానికి చెందిన మనోహర్ గతంలోనే హైచ్ ఐవీ బారిన పడ్డాడు. ఈ విషయాన్ని దాచిపెట్టి ఓ యువతితో వివాహానికి సిద్ధపడగా, ఆ విషయం బయటపడటంతో యువతి పెళ్లిని రద్దు చేసుకుంది. దీనిని అవమానంగా భావించిన మనోహర్, ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లి తనతో పెళ్లికి ఒప్పుకోవాలని ఒత్తిడి చేసి, ఆమె నిరాకరించడంతో ఉన్మాదిలా మారి తన రక్తం నిండిన ఇంజెక్షన్‌ను ఆమె శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు మనోహర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని నిలదీయగా పూర్తి వివరాలు వెల్లడించాడు.

# దేవుడా.. ఎంత పరీక్ష!

- అమ్మానాన్నలు శవాలయ్యారని తెలియక.. పరీక్ష రాసిన బిడ్డ
- నిజం దాచిన ఊరు.. గుండె నిబ్బరంతో పరీక్ష రాసిన వసంత!



అక్షర దర్బార్, గూడూరు: ఈ దృశ్యం చూస్తే రాతి గుండె అయినా కరగాల్సిందే. అమ్మానాన్నలు పట్నంలో హత్యకు గురై విగతజీవులుగా పడి ఉన్నా.. ఆ పాడు వార్త తెలిస్తే ఆ చిన్నారి భవిష్యత్తు చితికిపోతుందని ఒక ఊరంతా ఏకమై నిజాన్ని దాచింది. కన్నవారు ఇక లేరన్న సంగతి తెలియక, అమ్మానాన్నల కలల కోసం ఆ బాలిక పరీక్షా కేంద్రంలో పెన్ను పట్టింది. కానీ పరీక్ష రాసి ఇంటికి వచ్చేసరికి ఆమె ప్రపంచమే కూలిపోయింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గన్యచక్ర తండాలో జరిగిన ఈ హృదయవిదారక ఉదంతం ఇప్పుడు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టిస్తోంది.

### కూతురి చదువు కోసం వలస వెళ్లి..

తండాకు చెందిన సోము, మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురి పెళ్లి చేసిన ఈ దంపతులు, చిన్న కూతురు వసంతను బాగా చదివించాలని పట్టుదలతో హైదరాబాద్ పటాన్‌చెరువుకు వలస వెళ్లారు. అక్కడ కూలి పనులు చేస్తూ కూతురిని హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. అయితే, శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆ దంపతులను దారుణంగా హత్య చేశారు.

### కన్నీటి పరీక్ష.. కడసారి చూపు కోసం నిరీక్షణ

శనివారం ఉదయమే ఈ విషయం తండా వాసులకు తెలిసినా.. వసంత పదో తరగతి పరీక్ష చెడిపోకూడదని ఎవరూ ఆమెకు చెప్పలేదు. ఏమీ తెలియని ఆ చిన్నారి గుండె నిబ్బరంతో పరీక్ష రాసింది. తీరా పరీక్ష ముగిసి హాస్టల్ వార్డెన్ రజని సహాయంతో ఇంటికి చేరుకున్న వసంతకు.. అమ్మానాన్నలు హత్యకు గురయ్యారన్న వార్త పిడుగులా తగిలింది. "అమ్మా.. పరీక్ష బాగా రాశాను, ఒక్కసారి లేవమ్మా" అంటూ ఆ బిడ్డ చేసిన ఆర్తనాదాలు తండాను కన్నీటి సంద్రం చేశాయి. మరోవైపు, పోస్టుమార్టం ఆలస్యం కావడంతో శనివారం రాత్రి వరకు మృతదేహాలు తండాకు చేరుకోలేదు. కన్నవారి కడసారి చూపు కోసం ఆ పిల్లలు చేస్తున్న నిరీక్షణ వర్ణనాతీతం.

# గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ తనిఖీ

- రికార్డులను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి



అక్షరదర్బార్, కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఉన్న ఎల్పీజీ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఎల్పీజీ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ కు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. నిర్వహణకు సంబంధించిన పలు వివరాలను ప్లాంట్ అధికారులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ కొరత జిల్లాలో లేదని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న గృహ వినియోగదారులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని వినియోగదారులు ప్రజలు నమ్మొద్దని కోరారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, డిటి సదానందం, తదితరులు ఉన్నారు.

### - ఎంజేపీలో ఆకస్మికంగా తనిఖీ

కమలాపూర్ లోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్డు ను పరిశీలించి విద్యార్థులకు చేస్తున్న వంటలను గురించి అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంట గ్యాస్ నిల్వల గురించి ఆరా తీశారు. విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను పరిశీలించారు.

# తగినన్ని సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి



అక్షర దర్బార్ /ములుగు జిల్లా ప్రతినిధి: తగినన్ని సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వినియోగదారులు ఆందోళన చెందారని ఉపతహసిల్దారు కే సతీష్ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ములుగు మండలం లోని గ్యాస్ ఏజెన్సీ ల వద్ద గృహోపయోగ సిలిండర్ లు తగినన్ని అందుబాటు లో వున్నాయి. ఎటువంటి కొరత లేదు అని కావున వినియోగదారులు తొందరపడి అవసరానికి ముందుగా సిలిండర్ కొరకు బుకింగ్ చేయడం గ్యాస్ ఏజెన్సీ ల వద్ద నుండి అవసరం లేకున్నా ఆతృతతో ముందుగా తీసుకుని అవసరానికి మించి నిల్వ చేయడం చేయ రాదు అన్నారు .దీని వల్ల కృత్రిమ కొరత ఏర్పడే అవకాశం ఉంది. గ్యాస్ ఏజెన్సీ లపై కూడా నిరంతర నిఘా పెట్టడం జరిగింది. ఏ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అయినా సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించినా, ఎక్కువ ధర కు విక్రయాలు జరిపినా వారి పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కూడా తెలియ చేయడం జరుగుతుంది అన్నారు. శనివారం ములుగు మండల ములుగు పట్టణము లో వివిధ హోటల్స్ ల లో చేసిన తనిఖీలలో బాగంగ మొత్తం 5 కేసులు లు బుక్ చేసి మొత్తం 11 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు సీజ్ చేయబడినవి అని ఆయన అన్నారు.

# శంకర్ కుటుంబానికి ఆర్థిక సాయం

- లక్ష రూపాయల చెక్కు అందజేసిన పీఆర్టీయూ నేతలు



అక్షర దర్బార్, మహబూబాబాద్ : ఇటీవలే అకాల మరణం చెందిన పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు హలావత్ శంకర్ కుటుంబానికి ఆ సంఘం అండగా నిలిచింది. పీఆర్టీయూ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి (శ్రీపాల్ రెడ్డి) ఆదేశాల మేరకు సంఘ క్రియాశీల సభ్యత్వ నిధి నుండి మంజూరైన రూ. 1 లక్ష ఆర్థిక సహాయాన్ని జిల్లా మాజీ అధ్యక్షుడు సంకా బద్రీనారాయణ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బద్రీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకానికి, సంఘానికి శంకర్ మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన సభ్యుల కుటుంబాలను ఆదుకోవడం సంఘం బాధ్యత అని పేర్కొంటూ శంకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దామోదర్ రెడ్డి, భిక్షం గౌడ్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు భూక్యా రామోజీ నాయక్, గుగులోత్ భోజన్, బానోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

- మామునూరు సమీపంలో ఘటన
- స్కూటీని ఢీకొట్టిన బొలెరో వాహనం

అక్షరదర్బార్, మామునూరు : వరంగల్ – ఖమ్మం హైవేపై వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం మామునూరు వద్ద శనివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. అతివేగంగా దూసుకొచ్చిన ఒక బొలెరో వాహనం, స్కూటీని బలంగా ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు శ్రీపతి వంశీ, శ్రీపతి రాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో స్కూటీ నుజ్జునుజ్జు అవ్వగా, యువకులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాల పాలై మృతిచెందారు. యువకులు పనికి వెళుతూ స్కూటీపై బయల్దేరగా, మామునూరు పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం అదుపుతప్పి వీరిని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బోలెరో డ్రైవర్ ఆగకుండా, అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. భారీ శబ్దం రావడంతో స్థానికులు పరుగున వచ్చి చూసేసరికే యువకులు రక్తపు మడుగులో ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రేమ పేరుతో మోసం..

- ఎమ్మెల్యే గండ్ర పీఏ శ్రీనివాస్ అరెస్ట్
- జడ్జి ఎదుట హాజరు.. రిమాండ్ కు తరలింపు
- నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

అక్షరదర్బార్, రేగొండ : ఓ దళిత యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడనే ఆరోపణలపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వ్యక్తిగత సహాయకుడు (పీఏ) శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఒక దళిత యువతికి కొన్నేళ్ల క్రితం శ్రీనివాస్ పరిచయమయ్యాడు. ఆమెను ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ ఆమెకు తెలియకుండానే మరో అమ్మాయితో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పెద్ద మనుషుల మధ్య పంచాయితీ కూడా జరిగింది. అయినప్పటికీ శ్రీనివాస్ సదరు యువతిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు నిందితడిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, మోసం కేసు నమోదు చేసినట్లు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ వెల్లడించారు.

# మహేష్ రెడ్డికి డాక్టరేట్

- పుట్ట మధుకర్ హర్షం



అక్షర దర్బార్, మల్హార్ : తాడిచర్ల ఏఎంఆర్ కంపెనీ చైర్మన్, ఎండీ ఆళ్లూరు మహేష్ రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల మంథని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని పుణేలో ఉన్న తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్ విశ్వవిద్యాలయం 44వ స్నాతకోత్సవంలో ఈ గౌరవాన్ని మహేష్ రెడ్డికి ప్రదానం చేసింది. గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఏఎంఆర్ సంస్థ ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ వ్యాపార రంగంలో రాణిస్తున్న మహేష్ రెడ్డికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణమని అన్నారు. ఈ గౌరవం దక్కినందుకు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915